క్లుప్తంగా

మండలాల్లో ఎమ్మెల్యే పర్యటన

చెన్నూర్: చెన్నూర్, భీమారం మండలాల్లో ఆదివారం ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి పర్యటించనున్నారు. ఉదయం 11గంటలకు భీమారం మండలంలోని బూరుగుపల్లి, నర్సింగపూర్, కాజిపల్లి గ్రామాల్లో ఇటీవల కురిసిన అకాల వర్షంతో పంట నష్టపోయిన కుటుంబాలను పరామర్శించనున్నారు. మధ్యాహ్నం 12గంటలకు చెన్నూర్ మండలంలోని ఒత్కులపల్లి, గొల్లగూడెం (గంగారం) గ్రామాల్లో రూ.3కోట్ల సీఆర్ఆర్ నిధులతో బీటీ రోడ్డు నిర్మాణంతో పాటు బ్రిడ్జ్ నిర్మాణాల పనుల ప్రారంభం, 1గంటకు దుబ్బాపల్లి గ్రామంలో రూ.3.55కోట్ల సీఆర్ఆర్ నిధులతో జిల్లా పరిషత్ రోడ్డు నిర్మాణం పనులకు శంకుస్థాపన, 3గంటలకు చెన్నూర్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి ఎంపీడీవోలతో నిర్వహించే సమీక్ష సమావేశానికి హాజరు కానున్నారు. అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

బీజేపీ చెన్నూర్ పట్టణ అధ్యక్షుడిగా శ్రీపాల్



నియామకపత్రం అందిస్తున్న వెంకటేశ్వర్ గౌడ్

చెన్నూర్: చెన్నూర్ పట్టణానికి చెందిన తుమ్మ శ్రీపాల్‌ను బీజేపీ చెన్నూర్ పట్టణ అధ్యక్షుడిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ.. తుమ్మ శ్రీపాల్ బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడిగా పని చేసి పార్టీ అభివృద్ధి కోసం కృషి చేశారని, చెన్నూర్ పట్టణంలో బీజేపీ బలోపేతం కోసం పాటు పడుతారనే నమ్మకంతో పట్టణ అధ్యక్షుడిగా నియమించినట్లు తెలిపారు.

సదస్సులు విజయవంతం చేయాలి

లక్సెట్టిపేట: కోర్టు ఆధ్వర్యంలో నిర్వహించే న్యాయ అవగాహన సదస్సులు విజయవంతం చేయాలని మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి సాయికిరణ్ అన్నారు. శనివారం కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన న్యాయవాదుల సమావేశంలో మాట్లాడారు. ప్రతీ నెలలో నాలుగు లీటరసీ క్యాంపులు నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొమిరెడ్డి సత్తన్న, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు



చక్రస్నానంలో పాల్గొన్న కమాండెంట్, భక్తులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేట పోలీస్ బెటాలియన్ ఎదురుగా ఉన్న గోవింద క్షేత్రంలో నిర్వహిస్తున్న అధ్యయన సహిత చతుర్దశ వార్షిక మహోత్సవాలు ఘనంగా ముగిశాయి. శనివారం ఆలయ అర్చకులు నరసింహస్వామి, ప్రమోద్ రామానుజ దాసన్ ఆధ్వర్యంలో మహా పూర్ణాహుతి నిర్వహించారు. ఉత్సవాల్లో గోవిందక్షేత్ర ఆలయ దాసవాహిని అధ్యక్షుడు, బెటాలియన్ కమాండెంట్ దంపతులు పద్మ–వెంకటరాములు, కమిటీ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

లక్సెట్టిపేట: మండలంలోని చందారం గ్రామంలో శ్రీ రామచంద్రస్వామి వారి ఆలయంలో గత నెల 30వ తేదీ నుంచి శనివారం వరకు బ్రహ్మోత్సవాలు కొనసాగాయి. అభిషేకం, సుదర్శన, నవగ్రహహోమం, పూర్ణాహుతి, శ్రీ సీతారాముల కళ్యాణం ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మిర్యాల కిషన్‌రావు, కమలాదేవి, ఆగమరావు, గిరిజదేవి, పూర్ణచందర్‌రావు, అనుముల వేణు, రవీందర్, నవీన్ పాల్గొన్నారు.

ఎఫ్ఐఆర్ ప్రతితో నిరసన

బెల్లంపల్లి: తనపై సొంతపార్టీ నాయకుడు పెట్టిన అక్రమ కేసును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ బెల్లంపల్లి కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సంఘం పట్టణ అధ్యక్షుడు ఎండి గౌస్ నిరసన వ్యక్తం చేశారు. తనపై నమోదైన ఎఫ్ఐఆర్ ప్రతితో కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఎదుట జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహం వద్ద కూర్చొని గంటకు పైగా ఆందోళన చేశారు. ఈ సందర్భంగా గౌస్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ముచ్చర్ల మల్లయ్య రాజకీయంగా కక్షపెట్టుకొని, అన్యాయంగా తనపై కేసు పెట్టారని తెలిపారు. అక్రమ కేసును రద్దు చేసి తనకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. న్యాయం జరిగే వరకు పోరాడుతానని ఆయన పేర్కొన్నారు. ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో కాంగ్రెస్ శ్రేణులు గౌస్ చేత బలవంతంగా ఆందోళన విరమింపజేశారు.



ఆరే 'దారి'ది..!

దండేపల్లి: యాసంగి వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి.. దీంతో కొనుగోలు కేంద్రాలకు ధాన్యం పోటెత్తుతోంది. చాలా చోట్ల ధాన్యం ఆరబోసేందుకు కల్లాలు లేకపోవడంతో రైతులు అవస్థలు పడుతున్నారు. దండేపల్లి మండలంలోని గూడెం–మేదరిపేట రింగ్ రోడ్డు దారిని ఇలా ధాన్యం ఆరబెట్టేందుకు వినియోగించుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కల్లాలు ఏర్పాటు చేయాలని అన్నదాతలు కోరుతున్నారు. ఈ దృశ్యాన్ని 'సాక్షి' క్లిక్‌మనిపించింది.



ఎర్ర బురద.. ప్రజల వ్యథ

వేమనపల్లి: కాంట్రాక్టర్ నిర్లక్ష్యం నీల్వాయి గ్రామపంచాయతీ ప్రజలకు శాపంగా మారింది. రెండేళ్లక్రితం ప్రారంభిచాల్సిన పనులు ఇటీవల ప్రారంభించడంతో, కురుస్తున్న వర్షాలతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. రోడ్డుకిరువైపులా ఎర్రమట్టి పోయడంతో వరద బయటకు వెళ్లలేక ఎర్రబురదతో రోడ్డు చెరువును తలపిస్తున్నాయి. రాకపోకలకు ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా గ్రామపంచాయతీ, ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి సకాలంలో పనులు పూర్తి చేయాలని, బురద కష్టాలను తీర్చాలని ప్రయాణికులు కోరుతున్నారు.



మోడల్ హౌస్ పునాదులకే పరిమితం!

భీమారం: ప్రతీ గ్రామంలో పేదలకు ఇందిరమ్మ ఇళ్లని మంజూరు చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం హౌసింగ్ శాఖ ఆధ్వర్యంలో మొదట మండల కేంద్రంలో ఆరునెలల క్రితం రూ.5లక్షలతో మోడల్ హౌస్ నిర్మించేందుకు చర్యలు చేపట్టింది. దీనిని నిర్మించి ప్రజలకు చూపించాలనే.. ఉద్దేశంతో పనులు మొదలు పెట్టినా.. ఆచరణలో మాత్రం వెనుకబడింది. ఇప్పటివరకు పునాదులకే పరిమితమైంది. ఒక వైపు మండలంలోని దాంపూర్‌లో ఇళ్ల నిర్మాణం జరుగుతున్నా, ప్రజలకు ఆదర్శంగా ఉండే హౌస్ మాత్రం పునాదుల దశలోనే దర్శనమిస్తోంది. ఇప్పటికైనా ఇందిరమ్మ మోడల్ హౌస్‌ని సత్వరమే పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.



మంచిర్యాల కార్పొరేషన్ కార్యాలయం

విలీన.. కష్టాలు!

- మంచిర్యాల కార్పొరేషన్‌గా మారి మూడు నెలలు పూర్తి
- ఇప్పటికీ విలీన గ్రామాలకు అందని ఆన్‌లైన్ సేవలు
- కార్మికులకు అందని వేతనాలు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల కార్పొరేషన్‌గా మారి మూడు నెలలు అవుతున్నా, ఇంకా విలీన గ్రామాల సమస్య తీరడం లేదు. మంచిర్యాల మున్సిపాలిటీలో నస్పూర్ మున్సిపాలిటీ, హాజీపూర్ మండలంలోని వేంపల్లి, కొత్తపల్లి, ముల్కల్ల, పోచంపాడ్, గుడిపేట్, నంనూరు, చందనాపూర్, నర్సింగాపూర్ గ్రామాలు విలీనం చేస్తూ జనవరిలో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఫిబ్రవరి మొదటి వారంలోపు విలీన మున్సిపాలిటీ, గ్రామాలకు సంబంధించిన అన్ని రికార్డులను మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోకి తీసుకున్నారు. ఇది జరిగి మూడు నెలలు అవుతున్నా, కార్పొరేషన్ ద్వారా విలీన గ్రామాలకు ఇప్పటికీ ఆన్‌లైన్ సేవలు గాని, ఇతరత్ర సేవలు పూర్తిస్థాయిలో అందడం లేదు. కార్పొరేషన్‌గా మారిన అనంతరం విలీన గ్రామాల సమాచారాన్ని ఆన్‌లైన్‌లోకి మార్చడంలో జరుగుతున్న ఆలస్యం వల్ల ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం విలీన గ్రామాల్లో మొత్తం 40మంది పనిచేస్తున్నారు. అందులో ఐదుగురు కారోబార్లు కాగా, 35మంది పారిశుధ్య కార్మికులు ఉన్నారు. వీరికి జనవరి నుంచి ఇప్పటి వరకు వేతనాలు అందలేదు. విలీన ప్రక్రియ జరిగినా, వేతనాలను అందుకోవడంలో జాప్యం జరుగుతోంది. నస్పూర్ మున్సిపాలిటీనే కావడంతో, కార్పొరేషన్‌లో మెర్జ్ కావడం వల్ల ఆన్‌లైన్ సేవలకు ఎలాంటి ఇబ్బంది లేదు.

ఆన్‌లైన్ సేవలకు ఇబ్బంది..

హాజీపూర్ మండలంలోని 8 గ్రామాలను మంచిర్యాల కార్పొరేషన్‌లో కలిపినా, ఆన్‌లైన్‌లో అందించే సేవలను మెర్జ్ చేయడంలో ఆలస్యం అవుతోంది. ఫలితంగా బర్త్, డెత్ సర్టిఫికేట్‌లు అందని పరిస్థితులు నెలకొన్నాయి. గతంలో ఆయా గ్రామాల్లో పలు ధృవీకరణ పత్రాలు పొందిన వారికి మరోసారి ధృవీకరణ పత్రాలను పొందాలన్నా, మెర్జ్ కావడంలో వెబ్‌సైట్ రూపకల్పనలో జరుగుతున్న ఆలస్యంతో ధృవీకరణ పత్రాలను అందుకోలేక పోతున్నారు. ముల్కల్ల గ్రామానికి చెందిన రాదండ్ల మలమ్మ, కందుల రామక్క అనే ఇద్దరు మహిళలు కార్పొరేషన్ అయ్యాక మృతి చెందగా వారికి డెత్ సర్టిఫికేట్లు మూడు నెలలైనా అందడం లేదు. ఇంటి అనుమతులకు సైతం ఆన్‌లైన్ ఇబ్బందులు తప్పడం లేదు. పలు ప్రభుత్వ పథకాల సర్వేతో పాటు, ఎర్లీబర్డ్ స్కీం, ఎల్ఆర్ఎస్, రాజీవ్ యువ వికాసం, ఇందిరమ్మ ఇల్లు వంటి సర్వేతో వార్డుల్లోకి వెళుతుండడం, ఆన్‌లైన్ సక్రమంగా పనిచేయకపోవడంతో విలీన గ్రామాల ప్రజలు కార్యాలయం చుట్టూ పలు ధృవీకరణ పత్రాల కోసం తిరగాల్సి వస్తోంది. విలీన గ్రామాల ఆస్తి పన్ను వివరాలను సైతం మంచిర్యాల కార్పొరేషన్ ఆన్లైన్‌లో నమోదు కాకపోవడంతో పన్ను చెల్లించే వారు ఆన్లైన్ ద్వారా చెల్లించలేకపోతున్నారు. వీలైనంత త్వరగా విలీన గ్రామాలను కార్పొరేషన్‌లో పూర్తిస్థాయిలో మెర్జ్ చేస్తేనే అన్ని రకాల వసతులు, పారిశుధ్య కార్మికుల వేతనాల సమస్య తీరేందుకు అవకాశం ఉంది.

అన్ని సమస్యలు తీరుస్తాం..

మంచిర్యాల కార్పొరేషన్‌లో విలీనమైన నస్పూర్ మున్సిపాలిటీతో పాటు, హాజీపూర్ మండలంలోని 8 గ్రామాలకు ఆన్‌లైన్ సమస్య తీరుతుంది. ఇప్పటికే డెత్ సర్టిఫికేట్లు ఇవ్వడంలో అడ్డంకులు తొలిగాయి. బర్త్ సర్టిఫికేట్లు ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం. విలీన గ్రామాల్లోని కార్మికుల వేతనాలను ట్రెజరరీ నుంచి ఇవ్వాల్సి ఉండగా, ఇప్పటికే వేతనాలను ట్రెజరరీకు పంపించాం కార్మికులకు వస్తాయి. విలీన గ్రామాల అన్ని సమస్యలను తీరుస్తాం.

– శివాజి, మంచిర్యాల నగరపాలక సంస్థ కమిషనర్

ఆశవర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్



మాట్లాడుతున్న దుంపల రంజిత్‌కుమార్

పాతమంచిర్యాల: ఆశవర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని చార్వాక ట్రస్టు భవనంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని అనేక సార్లు అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా వారి సమస్య పరిష్కారం కాలేదన్నారు. జిల్లాలో ఆశవర్కర్ల సమస్యలు పరిష్కారం కాకపోవడం వల్లే వారు ధర్నాలు, ర్యాలీలు చేయాల్సి వస్తుందన్నారు. ఏప్రిల్ 28న కలెక్టర్ ఆదేశాలతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జిల్లాలోని ఆశాలు, 2వ కాంట్రాక్టు ఏఎన్ఎంలు పదే పదే ర్యాలీలు, ధర్నాలు చేపడుతున్నారని పై అధికారుల అనుమతి లేకుండా నిరసన కార్యక్రమాలు చేపడితే చర్యలు తప్పవని జారీ చేసిన సర్క్యులర్‌ను ఖండిస్తున్నామన్నారు. అధికారులు జారీ చేసిన సర్క్యులర్‌పై పునరాలోచన చేసి రద్దు చేయాలన్నారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు దాసరి రాజేశ్వరి, గోమాస ప్రకాష్, సహాయ కార్యదర్శి దూలం శ్రీనివాస్, శ్రీరాంపూర్ బ్రాంచ్ అధ్యక్షుడు రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

తాండూర్: మండలంలోని రేచినీ గ్రామ పంచాయతీలో శనివారం వడ్ల కొనుగోలు కేంద్రం ప్రారంభమైంది. సింగిల్ విండో చైర్మెన్ సుబ్బ దత్తుమూర్తి, కాంగ్రెస్ డీసీసీ ఉపాధ్యక్షుడు సూరం రవీందర్‌రెడ్డి హాజరై కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రైతులు కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వ్యాపారులు, దళారులకు పంట అమ్ముకొని నష్టపోవద్దన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎండీ ఈసా, మాజీ ఎంపీపీ సిరంగి శంకర్, మాజీ జెడ్పీటీసీ సాలిగామ బానయ్య, సింగిల్ విండో డైరెక్టర్ మాసాడి తిరుపతి, పులగం తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఫ్లై ఓవర్ బ్రిడ్జి కోసం కృషి



మాట్లాడుతున్న సీఐ శశిధర్‌రెడ్డి

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని యాపల్ ప్రాంతంలో జాతీయ రహదారిపై ఫ్లై ఓవర్ బ్రిడ్జి ఏర్పాటుకు కృషి చేద్దామని సీఐ శశిధర్ రెడ్డి అన్నారు. యాపల్ ఏరియాలోని జాతీయ రహదారి వద్ద శనివారం యాపల్ ఏరియా నాయకుడు అబ్బాస్ ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ మాట్లాడారు. జాతీయ రహదారికి ఇరువైపులా పలు కాలనీలు ఉండడం వల్ల రహదారి దాటే క్రమంలో ప్రమాదాలు జరిగి పలువురు ప్రాణాలు కోల్పోయిన విషయాన్ని గుర్తు చేశారు. జాతీయ రహదారి అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి, బ్రిడ్జి ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. ప్రజలు అప్రమత్తగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సై రాజశేఖర్, ఆయా ఏరియాల ప్రజలు పాల్గొన్నారు.

మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం

లక్సెట్టిపేట: దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని తీసుకున్న నిర్ణయంపై మండలంలోని బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక అంబేడ్కర్ చౌరస్తా వద్ద శనివారం మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మండల నాయకులు హరిగోపాల్, రమేశ్‌చంద్, ప్రభాకర్, వెంకటరమణ, రవి, పాంచాల రమేశ్, గంగన్న పాల్గొన్నారు.

ఘనంగా ఐఎన్టీయూసీ ఆవిర్భావ వేడుక



నస్పూర్: మాట్లాడుతున్న శంకర్‌రావు

నస్పూర్: ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్(ఐఎన్‌టీయూసీ) 78వ ఆవిర్భావ వేడుకలను నాయకులు ఘనంగా నిర్వహించుకున్నారు. శ్రీరాంపూర్ ఏరియా ఆర్కే 5గనిపై శనివారం జరిగిన కార్యక్రమంలో జాతీయ కౌన్సిల్ సభ్యులు సీహెచ్ భీంరావు, డిప్యూటీ జనరల్ సెక్రటరీ స్వామి జెండా ఆవిష్కరించి అనంతరం కేక్ కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఏరియా ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్ రావు మాట్లాడుతూ.. కార్మికులను కంటికి రెప్పలా కాపాడుకునేది ఐఎన్‌టీయూసీ మాత్రమేనన్నారు. జాతీయ స్థాయిలో అత్యధిక సభ్యత్వాలు కలిగి ఉన్నది ఐఎన్‌టీయూసీనని పేర్కొన్నారు. కార్మికుల హక్కులకు నిరంతరం పోరాటం చేస్తున్న జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డి, ప్రధాన కార్యదర్శి జనక్ ప్రసాద్‌లకు కార్మికుల తరుపున కృతజ్ఞతలు తెలియజేశారు. కార్మిక చట్టాల రూపకల్పనలో, వాటి అమలులో సంజీవరెడ్డి కృషి మరువలేనిదన్నారు. కార్మికులు, నాయకుల అండదండలతో కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాడుతామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ప్రధాన కార్యదర్శి పేరం రమేశ్, ల్యాగల శ్రీనివాస్, నాయకులు నంబయ్య, రవి, నర్సింగ్, మహేశ్‌రెడ్డి, శ్రీను, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: ఏరియాలో ఐఎన్టీయూసీ ఆవిర్భావ దినోత్సవాన్ని యూనియన్ నాయకులు శనివారం ఘనంగా జరుపుకున్నారు. స్థానిక ఐఎన్టీయూసీ యూనియన్ వద్ద ఆ యూనియన్ జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో ఐఎన్టీయూసీ కేంద్ర కమిటీ సీనియర్ ఉపాధ్యక్షుడు కాంపెల్లి సమ్మయ్య, యూనియన్ నాయకులు దేవి భూమయ్య, రాంశెట్టి నరేందర్, సూర్యనారాయణ, వెంకటస్వామి, భాస్కర్, సదయ్య పాల్గొన్నారు.

విరిగిన స్తంభాలు.. పడిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు

- అకాల వర్షాలకు విద్యుత్ శాఖకు భారీ నష్టం
- కొనసాగుతున్న పునరుద్ధరణ పనులు
- వ్యవసాయ రంగానికి మరో మూడు రోజుల్లో పూర్తి..



బూర్గుపల్లి సమీపంలో ఒరిగిన ట్రాన్స్ ఫార్మర్



నర్సింగాపూర్‌లో విరిగి పడిపోయిన స్తంభం

భీమారం: అకాల వర్షం విద్యుత్ శాఖకు భారీ నష్టం మిగిల్చింది. మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం రాత్రి ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురవగా మండలంలో విద్యుత్ సరఫరా ఎక్కడికక్కడ నిలిచిపోయింది. భీమారం, పోతన్‌పల్లి, బూర్గుపల్లి, నర్సింగాపూర్, కాజిపల్లి, ధర్మారం, దాంపూర్ గ్రామాల్లో మొత్తం 80విద్యుత్ స్తంభాలు విరిగిపోగా, రెండు ట్రాన్స్‌ఫార్మర్లు పడిపోయాయి. అందులో కొన్ని వ్యవసాయరంగానికి సరఫరా చేసే విద్యుత్తు లైన్లు ఉండగా, చాలా వరకు గృహ అవసరాల విద్యుత్ లైన్ స్తంభాలే ఉన్నాయి. విద్యుత్ అధికారులు రంగంలోకి దిగి శుక్రవారం ఉదయం విద్యుత్ పునరుద్ధరణ పనులు ప్రారంభించి మొదట మండల కేంద్రంలో, రాత్రి వరకు ఇళ్లకు సరఫరా చేశారు. శనివారం గ్రామాల్లో విరిగిపోయిన స్తంభాల చోట కొత్తవి ఏర్పాటు చేసి బూర్గుపల్లి, నర్సింగాపూర్, కాజిపల్లిలకు విద్యుత్‌ను అందించారు. అయితే వ్యవసాయ రంగానికి విద్యుత్ అందించేందుకు మరో మూడు రోజులు పట్టొచ్చని విద్యుత్తు శాఖ అధికారులు 'సాక్షి'కి తెలిపారు.

సంక్షిప్త వార్తలు

రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ

మంచిర్యాలఅగ్రికల్చర్: రేషన్‌కార్డుల జారీ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని, దరఖాస్తుదారుల వివరాలు క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులకు రేషన్‌కార్డు జారీ చేస్తామని జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్ ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో పెండింగ్‌లో ఉన్న నూతన రేషన్‌కార్డులు, సభ్యుల పేర్లు చేర్చడంపై విచారణ జరిపి జిల్లాలో 956 నూతన రేషన్‌కార్డులు మంజూరు చేసినట్లు తెలిపారు. రేషన్‌కార్డుల్లో పిల్లల పేర్లు, ఇతర మార్పులకు సంబంధించి 29,237 దరఖాస్తులు రాగా విచారించి ఆమోదించామని తెలిపారు. మీ సేవలో రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

యువతి అదృశ్యం

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని ఎన్‌టీఆర్ నగర్‌కు చెందిన వానరాసి కోర్నాల్–ఎల్లమ్మ దంపతుల కూతురు ఏలీషాబేతు డిగ్రీ రెండో సంవత్సరం చదువుతోంది. శుక్రవారం రాత్రి ఆమె తన కుటుంబ సభ్యులకు చెప్పి మేడ మీదికి వెళ్లి పడుకుంది. శనివారం ఉదయం 7గంటలకు కుటుంబ సభ్యులు మేడ మీదికి వెళ్లి చూడగా ఏలీషాబేతు కనిపించలేదు. బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లేదు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై ప్రవీణ్‌కుమార్ మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

రైతుల ఖాతాల్లో నగదు జమ

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో ఇప్పటివరకు ధాన్యం సేకరించిన రైతుల ఖాతాల్లో రూ.15.47 కోట్లు జమ చేసినట్లు జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్ ప్రకటనలో తెలిపారు. 4,335 మంది రైతుల నుంచి 37,730 టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, 155 లారీల ద్వారా 1,600 నుంచి 3 వేల టన్నుల ధాన్యం కరీంనగర్‌లోని 48 మిల్లులు, జిల్లాలోని 16 మిల్లులకు తరలించామని తెలిపారు. రైతు నిబంధనల మేరకు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకు రావాలని తెలిపారు.

స్పందించి.. పరిష్కారానికి ఆదేశించి

లక్సెట్టిపేట: మండలంలోని వెంకట్రావుపేట గ్రామంలో పంట కాలువను అదే గ్రామానికి చెందిన వ్యక్తి పూడ్చివేయడంతో రైతు శంకరయ్య ప్రజా ఫిర్యాదు విభాగంలో గత నెల 22న ఫిర్యాదు చేశాడు. తహసీల్దార్ దిలీప్‌కుమార్, ఎస్సై సురేష్, ఇరిగేషన్ జేఈ రాజేందర్ శనివారం సంఘటనా స్థలాన్ని పరిశీలించి వెంటనే ఆ పూడికను తొలగించి కాలువను శుభ్రం చేయాలని ఆదేశించారు. సోమవారం పనులు ప్రారంభించి కాలువ ద్వారా నీరు మళ్లీ రైతులకు అందేలా చేస్తామన్నారు.

తాగునీటి కోసం ఆందోళన

మందమర్రిరూరల్: మండలంలోని ఆదిల్‌పేట్‌లో తాగునీటి సమస్యపై ఆ గ్రామ మహిళలు శనివారం ఎంపీడీవో కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందించారు. రెండు నెలలుగా గ్రామంలోని ఒ కటో వార్డులో తాగునీటి సరఫరాకు ఇబ్బందిగా ఉందని, అధికారులకు చెప్పినప్పటికీ పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో భవాని, దేవమ్మ, భారతి, లక్ష్మి, మధులత, రాజక్క, విజయ ఉన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని గౌతమినగర్ రామాలయం వద్ద గుర్తుతెలియని వ్యక్తి గత మూడు రోజుల క్రితం అనారోగ్యంతో పడిపోయి ఉంటే, స్థానికులు గమనించి అంబులెన్స్ సాయంతో ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆ వ్యక్తి శనివారం మృతి చెందినట్లుగా స్థానిక సీఐ ప్రమోద్‌రావు తెలిపారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రిలో భద్రపరిచినట్లు తెలిపారు. వివరాలకు 87126 56534, 87126 56595 నంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

విద్యుత్ షాక్‌తో ఆవు మృతి

మందమర్రిరూరల్: మండలంలోని ఆదిల్‌పేట్ గ్రామానికి చెందిన ఆకుల శ్రీనివాస్ అనే రైతుకు చెందిన ఆవు శనివారం తెగిపడిన విద్యుత్ తీగలకు తగిలి విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది. ఆవు విలువ సుమారు రూ.50వేల వరకు ఉంటుందని ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

చెరువు కబ్జాపై అధికారులకు ఫిర్యాదు

లక్సెట్టిపేట: ఇటిక్యాల చెరువులో అక్రమంగా కబ్జా చేస్తున్న స్థలాన్ని కాపాడాలని సీపీఐ(ఎం)ఎల్ న్యూడెమొక్రసీ రాష్ట్ర వర్గ సభ్యులు శ్రీనివాస్ అన్నారు. జేసీబీతో చెరువులో మట్టిని తీస్తూ, చెరువు పక్కనే పోస్తూ రియల్‌ఎస్టేట్ వ్యాపారస్తులు చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధి స్థలాలను కబ్జా చేస్తున్నారని శనివారం ఆరోపించారు. చెరువు శిఖం భూమిని కాపాడాలని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలి పారు.

రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు

భీమారం: మండలంలో సోమవారం నుంచి భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ సదానందం శనివారం తెలిపారు. భూసమస్యలు ఎదుర్కొంటున్న రైతులు సదస్సుకు వచ్చి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 8వ తేదీ వరకు భీమారం, అరెపల్లి, బూర్గుపల్లి, వె ల్లపల్లిలో సభలు జరుగుతాయన్నారు. ఉదయం 9గంటలకు ప్రారంభవుతాయని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పాఠశాలలో సరస్వతి విగ్రహ ప్రతిష్ఠ

జన్నారం: మండలంలోని ధర్మారం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో అదే గ్రామానికి చెందిన రాగుల విద్య, రామచంద్రయ్య చార్యుల దంపతులు తమ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం సరస్వతి విగ్రహ ప్రతిష్టాపన చేయించారు. అనంతరం బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రితీష్ రాథోడ్, బీజేపీ మండల అధ్యక్షుడు మధుసూదన్‌రావు వెళ్లి అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. కార్యక్రమంలో స్వర్ణకారుల సంఘం నాయకులు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మర్ క్యాంపు వలంటీర్లకు శిక్షణ

జన్నారం/భీమిని/మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్, జైపూర్, మందమర్రి, లక్సెట్టిపేట మండలాల పరిధిలోని 59మంది, భీమిని, కన్నెపల్లి, నెన్నెల మండలాలకు చెందిన 43మంది, జన్నారం, దండేపల్లి మండలాల వేసవి శిబిరాల వలంటీర్లకు శనివారం ఒక రోజు శిక్షణ ఇచ్చారు. హాజీపూర్ ఎంఈఓ తిరుపతిరెడ్డి, భీమిని ఎంఈవో కృష్ణమూర్తి, జన్నారం ఎంపీడీవో ఉమర్ షరీఫ్, ఎంఈవో విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు, శిక్షకులు పాల్గొన్నారు.

వేసవి శిబిరం ప్రారంభం

దండేపల్లి/వేమనపల్లి: వేమనపల్లి మండలంలోని నీల్వాయి జిల్లా పరిషత్ పాఠశాలలో శనివారం యంగ్ ఇండియా సమ్మర్ క్యాంపును ఎంపీడీఓ కుమారస్వామి, ఎంఈవో శ్రీధర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ సంతోష్ కుమార్ ప్రారంభించారు. దండేపల్లి మండలం లోని వెల్గనూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో వేసవి శిబిరాన్ని పాఠశాల హెచ్ఎం విజయలక్ష్మి శనివారం ప్రారంభించారు.